క్లుప్తంగా

రావాల్సిన డబ్బులను రాబట్టాలి..


మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన రూ.25 వేల కోట్లను వెంటనే టీబీజీకేఎస్ రాబట్టాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శనివారం కొత్తగూడెం ఏరియాలోని ఆర్‌సీహెచ్‌పీలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 11వ వేతన సమావేశంలో బీఎంఎస్ జాతీయ కార్యదర్శి లక్ష్మారెడ్డి పెద్దన్న పాత్ర పోషించి కార్మికులకు 19 శాతం మినిమమ్ గ్యారెంటెడ్ బెనిఫిట్ సాధించారని తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం, సంస్థ మనుగడ కోసం బీఎంఎస్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షులు మొగిలిపాక రవి, నాగేశ్వరరావు, కాదాసి కుమారస్వామి, మొగిలిపాక నర్సింగరావు, పి.కృష్ణ, మాదాసు రవీందర్, ఆకుల హరిణ్, గాజుల వెంకటస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అరెస్ట్ సరికాదు


మాట్లాడుతున్న జేబీ శౌరి

కొత్తగూడెంరూరల్: ఈ నెల 12వ తేదీన సీఎం కేసీఆర్ కొత్తగూడెం పర్యటన సందర్భంగా గిరిజన, దళిత సంఘం నాయకులను అరెస్టు చేయడం సరి కాదని బహుజన ఐక్య వేదిక నాయకులు జేబీ శౌరి, వాసం రామకృష్ణ అన్నారు. శనివారం బహుజన ఐక్య వేదిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కొత్తగూడెంలో సీఎం కేసీఆర్ పర్యటన సమయంలో గిరిజన, దళిత సంఘం నాయకులను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో బానోతు రమేశ్, చార్వాక గద్దం రాజశేఖర్, మంగీలాల్‌నాయక్, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న మధు

ఇల్లెందు: రాష్ట్రంలోని ప్రజల సమస్యలు పరిష్కరించటంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు ఆరోపించారు. ఇల్లెందులోని ఎన్డీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ జిల్లాకు వస్తుండడంతో వరాలు ప్రకటిస్తారని ఆశించగా, ఏ సమస్యపై కూడా స్పందించలేదని పేర్కొన్నారు. అంతేకాకుండా సమస్యలపై వినతిపత్రం ఇవ్వాలని యత్నించిన నాయకులను పోలీసులు నిర్బంధించారని తెలిపారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించకపోగా, సొంత స్థలం ఉన్న వారికి రూ.3 లక్షలు ఇస్తామని ప్రకటించడం సరికాదన్నారు. కాగా, డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమస్యపై ఈ నెల 20న ఇల్లెందులో ఎన్డీ ఆధ్వర్యాన ర్యాలీ, మార్కెట్ యార్డులో సభ నిర్వహిస్తున్నట్లు మధు తెలిపారు. సమావేశంలో నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, సారంగపాణి, నర్సింహారావు, బి.సంగయ్య, సర్పంచ్‌లు సరోజిని, సంతు, శ్రీను పాల్గొన్నారు.

గనులను సందర్శించిన న్యాయమూర్తి


ఎకో పార్కులో న్యాయమూర్తి ఆశారాణి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే-5 షాఫ్ట్ భూగర్భ గనిని, జీకే ఓసీలోని ఎకో పార్క్‌ను శనివారం ఖమ్మం కోర్టు న్యాయమూర్తి కే.ఆశారాణి సందర్శించారు. గనిలో బొగ్గు ఉత్పత్తి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం బటర్‌ఫ్లై పార్క్‌ను, తేనెటీగల పార్క్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు మురళి, కరీముల్లా, ఎం. శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా భోగి

- ఇళ్ల ముంగిట రంగవల్లుల కళ
- భోగి మంటలతో సందడి


చుంచుపల్లి: రుద్రంపూర్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు

ప్రజలంతా భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే లేచి భోగి మంటలు వేశారు. అందులో పాత వస్తువులను వేసి దహనం చేశారు. మరుసటి రోజు సంక్రాంతి పర్వదినం సందర్భంగా అంతా కొత్తగా ఉండాలనే ఉద్దేశంతో ఈ మంటలు వేస్తారని పెద్దలు చెబుతారు. ఈ సందర్భంగా ఇళ్ల ముంగిట యువతులు, మహిళలు రంగులతో ముగ్గులు వేశారు. గొబ్బెమ్మలు, రేగుపళ్లు, నవధాన్యాలు పెట్టి అలంకరించారు. అంతేకాకుండా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

-సాక్షి నెట్‌వర్క్


పాల్వంచ: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు


పాల్వంచ: బహుమతులు అందిస్తున్న నాయకులు


కొత్తగూడెంఅర్బన్: ఫ్యాన్సీ డ్రెస్సుల్లో విద్యార్థులు


టేకులపల్లి: బ్రహ్మంగారి ఆలయంబజారులో భోగి మంటలతో స్థానికులు



జూలూరుపాడు: ముగ్గులు వేస్తున్న యువతులు


జూలూరుపాడు: ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నరేంద్రకుమార్


టేకులపల్లి: బిల్లుడుతండాలో ముగ్గులను పరిశీలిస్తున్న సర్పంచ్, గ్రామ పెద్దలు


టేకులపల్లి: బోడబజారులో..

సౌత్ ఇండియాస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు కార్తీక


కార్తీకను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఇల్లెందురూరల్: సౌత్ ఇండియా స్థాయి ఇన్‌స్పైర్, సైన్స్ ఫెయిర్ పోటీలకు ఇల్లెందులోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని భూక్యా కార్తీక ఎంపికైంది. ఈమేరకు పాఠశాలలో పాఠశాలలో ఆమెతో పాటు గైడ్ టీచర్ ఆరెం సుజాతను సన్మానించాక హెచ్‌ఎం తోలెం అనసూర్య మాట్లాడారు. ఇటీవల నిర్మల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో 'కార్బన్ క్యాప్చర్ పవర్ ప్లాంట్' ఎగ్జిబిట్‌ను ప్రదర్శించిన కార్తీక సౌత్ ఇండియా స్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. దక్షిణభారతదేశస్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు జరిగిన అన్ని పోటీల్లోనూ కార్తీక ప్రతిభ చూపిందని, ముందుముందు కూడా ఇలాగే కొనసాగాలని కోరారు. కార్యక్రమంలో పీడీ గుమ్మడి సమ్మయ్య, ఉపాధ్యాయులు విరంజి, ఇందిర, పద్మ, వసంత, మాలోత్ ప్రతాప్‌సింగ్‌నాయక్, కోటేశ్వరి, హరిరాం, సునీత, కుసుమ, సుజాత, సరిత, రాము, నగేశ్, వినోద, కృష్ణమూర్తి, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సభకు భారీగా తరలిరండి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సారయ్య, పక్కన ఎమ్మెల్యే వనమా తదితరులు

పాల్వంచరూరల్: ఖమ్మంలో ఈ నెల 18న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యాన జరగనున్న బీఆర్‌ఎస్ తొలి బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు భారీగా హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కోరారు. పాత పాల్వంచలోని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్‌ఎస్ బీఆర్‌ఎస్‌గా ఆవిర్భవించాక తొలిసారిగా ఖమ్మంలో నిర్వహిస్తున్న సభ దేశానికి కొత్త దశ చూపిస్తుందని తెలిపారు. తెలంగాణలో అమలుచేస్తున్న పథకాలు దేశ ప్రజలందరికీ దక్కాలన్నదే సీఎం తాపత్రయమని చెప్పారు. కాగా, సభకు మూడు రాష్ట్రాల సీఎంలతో పాటు సీపీఐ, సీపీఎం జాతీయ నేతలు హాజరవుతున్నందున కొత్తగూడెం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే వనమా నేతృత్వాన 20 వేల మంది కార్యకర్తలు, నాయకులు 200 వాహనాల్లో తరలిరావాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే వనమా మాట్లాడుతూ ఖమ్మం బహిరంగ సభను సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నందున శ్రేణులందరూ హాజరయ్యేలా సిద్ధంగా కావాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మితో పాటు వనమా రాఘవేంద్రరావు, కిలారు నాగేశ్వరరావు, భూక్యా సోనా, ఎంఏ రజాక్, కాసుల వెంకట్, భూక్యా రాంబాబు, మండే వీరహన్మంతరావు, మహిపతి రామలింగం, అన్వర్‌పాషా, కాంపెల్లి కనకేశ్, మల్లెల శ్రీరాంమూర్తి, పూసల విశ్వనాథం, రాజుగౌడ్, భాగం మోహన్‌రావు, పరంజ్యోతిరావు తదితరులు పాల్గొన్నారు.

పర్వతారోహకుడు యశ్వంత్‌కు సన్మానం

పాల్వంచ/టేకులపల్లి: యూరప్‌లోనే అత్యంత ఎత్తయిన మౌంట్ ఎల్‌బ్రష్ (రష్యా)తో పాటు హిమాచల్‌ప్రదేశ్‌లోని శిఖరాలను అధిరోహించిన భూక్యా యశ్వంత్‌నాయక్‌ను సన్మానించారు. పాల్వంచలోని కేటీపీఎస్ రీజినల్ ఉద్యోగుల సంఘం భవనంలో గ్రీన్ ఎర్త్ సొసైటీ వ్యవస్థాపకులు రమేశ్‌రాథోడ్ ఆధ్వర్యాన సన్మానించారు. టేకులపల్లిలో టీపీఎల్ హరిప్రియ కప్ టోర్నీ సందర్భంగా కూడా యశ్వంత్‌నాయక్‌ను సన్మానించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కేటీపీఎస్ గిరిజన ఫోర్‌మెన్ జెన్‌కో అధ్యక్ష, కార్యదర్శులు అంగోతు రాందాస్, మాలోతు నాగేశ్వరరావు, ఐటీడీఏ స్పోర్ట్స్ ఆఫీసర్ వీరూనాయక్‌తో పాటు నూనావత్ కేసులాల్, రమేశ్, బానోతు ప్రవీణ్, ధరావత్ దుర్గాప్రసాద్, తేజావత్ రాందాస్, మంగీలాల్, మోహన్, బాలకృష్ణ, ప్రియాంక, గీత, జాటోతు నరేశ్, సేవాదాస్, రైనా, శివరాళీ, దేవా, రవినాయక్, ప్రవీణ్, సందీప్, ప్రశాంత్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.


పాల్వంచలో యశ్వంత్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఇండోర్ షటిల్ కోర్టులు ప్రారంభం


షటిల్ కోర్టును ప్రారంభిస్తున్న సీఈలు

పాల్వంచ: కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో ఇండోర్ షటిల్ గ్రౌండ్‌లో షటిల్ కోర్టును శనివారం కేటీపీఎస్ 5, 6, 7 దశల సీఈలు ఎం.ప్రభాకర్‌రావు, పి.వెంకటేశ్వరరావు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో ఉద్యోగులు రాణించాలని, జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. వారికి యాజమాన్యం తరఫున సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈలు ఎస్.యుగపతి, గుర్రం రాజ్‌కుమార్, జి.శ్రీనివాసరావు, జి.కిరణ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు, ఎస్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ జంగయ్య, డీఈ ఎస్‌ఎన్‌ఎస్ శేఖర్, గేమ్స్ సెక్రటరీ వై.వెంకటేశ్వర్లు, క్రీడాకారులు రమేశ్, రమణ, కిరణ్‌కుమార్, ఆరీఫ్, డి.రమేశ్, షానవాజ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంభాని చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు


కేక్ తినిపిస్తున్న నాయకులు

కొత్తగూడెంరూరల్: పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ మంత్రి, పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు సంభాని చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు రాయల శాంతయ్య మాట్లాడారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రజల కోసం సంభాని పనిచేశారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొమ్మిడి మల్లికార్జున్, సకినాల వెంకటేశ్వరరావు, అంతోటి పాల్, గిన్నారపు నాగేందర్, పల్లపు వెంకటేశ్వర్లు, సిరంగి శ్రీనివాస్, ఏలూరి రాజేశ్‌కుమార్, కొప్పుల రమేశ్, వాలి, చంద్రకళ, కాలం నాగభూషణం, కలిపాక సత్యనారాయణ, వెలేటి వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, శనగ లక్ష్మణ్, భూక్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతు అంత్యక్రియలు పూర్తి

టేకులపల్లి: పురుగుల మందు వ్యాపారి దాడి చేయడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్న రైతు అంత్యక్రియలు శనివారం పూర్తిచేశారు. మండలంలోని తొమ్మిదోమైలుతండాకు చెందిన రైతు భూక్య హరిలాల్ (45) స్థానిక పురుగుల మందు, విత్తన షాపు యజమాని వద్ద అప్పుగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తీసుకుని తన రెండున్నర ఎకరాల్లో పత్తి, మిర్చి పంటలు సాగు చేశారు. షాపు యజమాని తప్పుడు లెక్కలు రాసుకుని, రశీదులు కూడా ఇవ్వకుండా అధిక రేట్లు, అధిక వడ్డీ వేసి ఎక్కువ మొత్తంలో అప్పు చూపెట్టడమే కాకుండా రైతు కుటుంబ సభ్యులపై దాడికి యత్నించాడు. దీంతో మనస్తాపం చెందిన హరిలాల్ ఈ నెల 11న పురుగుల మందు తాగి, చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందిన విషయం విదితమే. మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించి మధ్యాహ్నం 3 గంటల తర్వాత స్వగ్రామానికి పంపించారు. ఈ ఘటనపై మృతుడి భార్య భూక్య పద్మ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా రైతు మృతి నేపథ్యంలో గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. దీంతో మృతుడి భార్య స్పృహ తప్పి పడిపోయింది. తొమ్మిదోమైలుతండాకు చెందిన సర్పంచ్, ఎంపీటీసీ తరుపువారు, మరికొందరు గ్రామస్తులు కలిసి మంతనాలు జరిపి పరిహారం విషయంలో పంచాయితీ చేసినట్లు సమాచారం. రైతు మరణానికి రూ.ఆరున్నర లక్షలు ఖరీదు కట్టినట్లు సమాచారం. ఈ విషయమై ఎస్‌ఐ భూక్య శ్రీనివాస్‌ను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. వారు స్పందించ లేదు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: చర్చిలకు వెళ్లే దళిత క్రైస్తవులకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావుకు మండలంలోని దళిత సంఘాల నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. జిల్లాలోనూ చర్చిలకు వెళ్తున్న దళితులకు సంబంధించి ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు రద్దు చేయడంతోపాటు కొత్తవాటిని మంజూరు చేయడం లేదని వాపోయారు. సత్వరమే చర్యలు తీసుకొని దళితులందరికీ ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరయ్యేలా చూడాలని కోరారు. మేకల శ్యాంసుందర్, పుల్లయ్య, ఆదూరి రవి పాల్గొన్నారు.

పిలవడమెందుకు?

ఇల్లెందురూరల్: సభకు రమ్మని పిలుస్తారు.. కుర్చీలలో ఆసీనులైతే బయటకు పొమ్మంటారా..? అంటూ బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ చీమల వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 18న ఖమ్మంలో నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ బహిరంగ సభ సన్నాహక సమావేశం బొజ్జాయిగూడెం గ్రామ శివారులోని ఎస్‌ఎస్ గార్డెన్స్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమావేశానికి ప్రజాప్రతినిధులందరినీ హాజరుపర్చాలని ఎమ్మెల్యే హరిప్రియ ఆదేశం మేరకు తాము ప్రజాప్రతినిధులను చేర్చామన్నారు. వచ్చిన వారంతా సభలో ఏర్పాటు చేసిన కుర్చీలలో ఆసీనులయ్యారని, సభ కొనసాగుతుండగా ఎమ్మెల్సీ తాతా మధు మైక్ పట్టుకొని కుర్చీలలో ఆసీనులైన బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ ప్రజలు బయటకు వెళ్లాలని ఆదేశించడం అవమానంగా భావించి సమావేశాన్ని బహిష్కరించామని వివరించారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం


సుజాతనగర్: కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


పాల్వంచ: వెంకటేశ్వరస్వామి ఆలయంలో..

పాల్వంచ: పట్టణంలోని నవనగర్‌పైన ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంతోపాటు పట్టణంలోని భజన మందిరం (రామాలయం)లో గోదా దేవి కల్యాణ మహోత్సవాన్ని శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పూజారులు ఎస్.శేషాచార్యులు, గోపాల కృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణ మధ్య కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో మారుతి ప్రసాద్, ఎంజీఎం ప్రసాద్, మురళీ కృష్ణమాచార్యులు, రామాలయ ఈఓ రజినికుమారి, చలవాది ప్రకాష్ పాల్గొన్నారు.

సుజాతనగర్‌లో..

సుజాతనగర్: స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా శనివారం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ సాగిన కల్యాణాన్ని తిలకించేందుకు ఆయా గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కల్యాణానికి హాజరైన భక్తులందరూ హారతులు సమర్పించారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

క్రీడలు ఐకమత్యాన్ని పెంచుతాయి..

ఇల్లెందురూరల్: క్రీడలు ఐక్యమత్యాన్ని ప్రతిబింబిస్తాయని విజయలక్ష్మినగర్ ఎంపీటీసీ సభ్యుడు పూనెం సురేందర్ అన్నారు. మండలంలోని మిట్టపల్లి గ్రామంలో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. శనివారం జరిగిన ఫైనల్ పోరులో ఇల్లెందు జేకేకాలనీ ఆనంద్ లెవెన్ జట్టు, పాకాల కొత్తగూడెం జట్లు హోరాహోరీగా తలపడగా ఆనంద్ లెవన్ జట్టు విజేతగా నిలిచింది. పాకాల కొత్తగూడ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు పూనెం సురేందర్, ముక్తి కృష్ణ నగదు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తాటి శ్రీను, గుగులోత్ నాగార్జున, పూనెం నాగేశ్వరరావు, సూర్నబాక సంతోష్, కుమారి, లక్ష్మణ్ పాల్గొన్నారు.


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సురేందర్

బర్లగూడెంలో ముగిసిన వాలీబాల్ టోర్నీ


విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

టేకులపల్లి: మండలంలోని బర్లగూడెం గ్రామంలో మూడు మండలాల స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీలు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీసీబీ డైరెక్టర్, బేతంపూడి సొసైటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నేత లక్కినేని సురేందర్‌రావు విజేతలకు తన వితరణతో మొదటి బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.8 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహిస్తున్నందుకు నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ నేత భూక్య దళ్‌సింగ్‌నాయక్, సర్పంచ్ పూనెం రాంబాబు, నాగేంద్రబాబు, చింత కల్యాణ్, రాంబాబు, ఆనంద్ పాల్గొన్నారు.

జూనియర్ కార్మికులకు ఇన్‌కం ట్యాక్స్ భారం


మాట్లాడుతున్న విజయగిరి శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): 11వ వేతన ఒప్పందంలో పెరిగిన 19 శాతం వేతనంతో జూనియర్ కార్మికులపై ఇన్‌కం ట్యాక్స్ భారం పడుతుందని, ఇన్‌కం ట్యాక్స్ స్లాబ్‌ను పెంచేవిధంగా కార్మికులందరూ పోరాటంలోకి రావాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు పేర్కొన్నారు. శనివారం కార్పొరేట్ పరిధిలోని మెయిన్ వర్క్‌షాపులో ఏర్పాటు చేసిన పిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు.